# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 100
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
జనవరి 07, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## నిట్ ను సందర్శించిన 'కేశవమూర్తి'

ప్రముఖ రచయిత, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మంగళవారం హనుమకొండలోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్)ను సందర్శించారు. విద్యార్థులకు 'నిట్' అందిస్తున్న కోర్సుల గురించి శాఖాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ కెఎస్ రాజ్ మోహన్ ఘనంగా సన్మానించారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ



# నట్టేట ముంచుతున్న.. నకిలీ విత్తనాలు

- పరకాలలో వెలుగు చూసిన వైనం
- జర్మినేషన్, ఎదుగుదల శూన్యం
- కాతా, పూత లేని విత్తనాలు ఇచ్చారంటూ ఆవేదన
- యథేచ్ఛగా దందా
- అధికారుల నిర్లక్ష్యంతోనే నాసిరకం విత్తనాలు
- రోడ్డున పడుతున్న రైతన్నలు



రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, నాసిరకం విత్తనాలు విక్రయించి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవంటూ ప్రభుత్వం ఎన్ని సార్లు హెచ్చరికలు జారీ చేసినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. విక్రయదారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా అధిక లాభాలకు ఆశపడిన కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి నాసిరకం విత్తనాలతో మోసపోయి నట్టేట మునిగిన రైతులకు చెందిన మరో బాగోతం పరకాలలో వెలుగుచూసింది. పరకాల పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పత్తి, మిర్చి విత్తనాలను స్థానికంగా కొనుగోలు చేసి నాటుకున్నా మొక్కల్లో ఎదుగుదల, జర్మినేషన్ లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కాతా, పూత లేదని వాపోతున్నారు. దీంతో తాము నష్టపోయామని భావించిన రైతులు వ్యవసాయ అధికారులు, విత్తన దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు తగిన న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే నాసిరకం విత్తనాల దందా యథేచ్ఛగా సాగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

వివరాలు 2లో..

- వరంగల్ వాయిస్, పరకాల

8లో..



## భక్తులకు సకల సౌకర్యాలు

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశం
- పాల్గొన్న కుడా చైర్మన్, మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

## మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా విస్తరణ

- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
- కలెక్టర్ పి.ప్రావీణ్య
- పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్ష



2లో..

8లో..



## ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం

- అప్పుడే ప్రజల ఇబ్బందులు తొలిగిపోతాయి
- పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క

# నట్టేట ముంచుతున్న.. నకిలీ విత్తనాలు

- పరకాలలో వెలుగు చూసిన వైనం
- జర్మినేషన్, ఎదుగుదల శూన్యం
- కాతా, పూత లేని విత్తనాలు ఇచ్చారంటూ ఆవేదన
- రోడ్డున పడుతున్న రైతన్నలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణంలో నాసిరకం విత్తనాల బాగోతం వెలుగు చూసింది. అయితే నకిలీ సీడ్స్ విక్రయాలకు పరకాల అడ్డాగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. నాసిరకం విత్తనాలు, ఫెస్టిసైడ్స్ పై ఉక్కుపాదం మోపాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు అక్రమార్జనకు అలవాటు పడి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఫిర్యాదులు అందుతున్నాయి. వారి పర్యవేక్షణాలోపంతోనే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారంటున్నారు.







### నెల రోజులైనా..

రెండో పంట నేపథ్యంలో గత నెలలో సీడ్స్ అమ్మకాలు జోరుగా సాగాయి. పరకాల పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు కొన్ని వందల ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు పండించేందుకు పలువురు దాకాణదారులనుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. వీటిని నాటి నెలరోజులైనా ఎలాంటి ఎదుగుబొదుగు లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో తాము నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయామని భావించిన పలువురు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా వారి మొరను వినే నాధుడే కరువయ్యారు.

### చర్యలు శూన్యం..

నాసిరకం విత్తనాలు విక్రయించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలంటూ వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు అండగా నిలిచి పంటలపై తగు సలహాలు, సూచనలు చేయాల్సిన అధికారులు విత్తన విక్రయ దుకాణదారులతో అంటకాగుతూ వారికి లాభం చేకూరేలా వ్యవహరిస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. ఇక ఫెస్టిసైడ్స్, పర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నాసిరకం విత్తనాలను అధిక దరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పరకాల నాసిరకం విత్తనాల విక్రయాలకు అడ్డాగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల నిర్వాహణకు అధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నట్లు ప్రచారం ఉంది. అయితే వందల ఎకరాల్లో పత్తి, మర్చి, మొక్కజోన్న నాటి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే గోదాముల్లో పెద్ద మొత్తంలో నాసిరకం విత్తనాలను డంప్ చేశారంటున్నారు. విత్తనాలు సరఫరా చేసే కంపెనీలతో కుమ్మక్కై రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న దుకాణ దారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా

### కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రజా పాలనలో ఇంటి నిర్మాణం కొరకు దరఖాస్తు చేసినప్పటికీ యాప్ లో నమోదు కాని వారి వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని వరంగల్ మహా నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే హామీ ఇచ్చారు. మంగళవారం మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తన డివిజన్ లోని 200 మంది అర్హుల వివరాలను కమిషనర్ కు అందజేశారు. ప్రభుత్వం ఒక వేళ యాప్ లో పేర్లు నమోదు కాని వారిని సర్వే చేయాలని ఆదేశిస్తే తప్పని సరిగా రీ సర్వే జరిపిస్తామని కమిషనర్ వెల్లడించారు.



## కేటీఆర్ కు మద్దతుగా నిలిచిన 'నన్నపునేని'

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రేవంత్ రెడ్డి సర్కార్ అక్రమ కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. కేటీఆర్ కు మద్దతుగా మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు నరేందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హైదరాబాద్ లోని కేటీఆర్ నివాసం నంధీనగర్ కు తరలి వెళ్లారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పని చేసిన బీఆర్ఎస్ పార్టీపై బురద జల్లేందుకే రేవంత్ సర్కార్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టినందుకే కేటీఆర్ పై కక్షగట్టి అక్రమ కేసులో ఇరికించారన్నారు. కేటీఆర్ కు అండగా ఉంటామంటూ నరేందర్ ప్రకటించారు.

# మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా విస్తరణ



- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
- కలెక్టర్ పి.ప్రావీణ్య
- పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా నగరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా విస్తరణ పనులు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని, అందుకుగాను వారికి ప్రత్యేక అధికారులు ఇస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రకటించారు. అదే విధంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రధాన రహదారుల వెంట ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. భద్రఖాళి బండ్, వడ్డేపల్లి బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బండ్ ఆవరణలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా నగరంలో వివిధ పార్క్ లలో ఉన్న ఓపెన్ జిమ్ పరికరాల మరమత్తులు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. బాలసముద్రం, పోతన నగర్ లోని జీడబ్ల్యూఎంసీ డంప్ యార్డులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హనుమకొండ బస్టాండ్ జంక్షన్ నుంచి కాంగ్రెస్ భవన్ వరకు ఎడమ వైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెడల్పు చేస్తే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రధాన రహదారుల్లోని భవనాలకు వెనక్కి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ భవన్ నుంచి రెడ్డి కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు వెడల్పులో ఉన్న వారికి రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పోతన నగర్ రోడ్డు వైడ్నింగ్, భద్రకాళి అమ్మవారి పార్కింగ్, పెద్దమ్మగడ్డ చివర రోడ్డు విస్తరణ పరిశీలించాలని, బాధితులు ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

### కబ్జాలపై దృష్టి..

నగరంలో ఏమైనా ఖబ్జాలు ఉంటే అధికారులు వెంటనే దృష్టి సారించి వాటిని ఆదీనంలోకి తీసుకోవాలని ఏమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని, రోడ్డుపై ఉన్న వారిని లోపలికి తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రద్దీగా ఉండే దవాఖానలు, షాపింగ్ మాల్స్, హోటల్స్ లలో గ్రౌండ్ లో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా నిర్మించే వ్యాపార సముదాయాల భవనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటేనే అనుమతులు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళలకు చేయూతనిచ్చేలా ప్రభుత్వం ప్రత్యేకంగ అమలు చేస్తున్న ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ లను విస్తరించాలన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో, ఆర్ టీసీ బస్ స్టాండ్ ఆవరణ, రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి కాంటీన్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో స్వచ్ఛ ఆటోలు 142 ఉన్నాయి. నిరంతరం డ్రైనేజీ వ్యవస్థ, చెత్త సేకరణ పనులను ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. నగరంలో ఉన్న పార్క్ ల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. కాజీపేట నుంచి సోముడి మార్గంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. హంటర్ రోడ్డు లోని విష్ణుప్రియ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో వెంటనే సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, శంకుస్థాపన చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్ డీఓ రాథోడ్ రమేష్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ట్రాఫిక్ ఏసీపీ భాను కిరణ్, కుడా ఈఈ భీం రావు, ఇరిగేషన్ ఈఈ సీతారాం నాయక్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, నోడల్ అధికారి రాజేందర్, తహసీల్దార్లు భావ్ సింగ్, శ్రీపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి, టౌన్ ప్లానింగ్, స్మార్ట్ సిటీ, విద్యుత్తు శాఖ, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 108 సేవలు వినియోగించుకోవాలి

## ● మంత్రి శ్రీధర్ బాబు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంగళ వారం మండలంలో పర్యటించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొయ్యూరు గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన 108 వాహనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని తాడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనం అందుబాటులో ఉంటుందని అత్యవసర సమయంలో మండల ప్రజలు 108 సేవలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. అనంతరం యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్ వైజర్లకు ఎలక్ట్రానిక్ స్కూటీలను అందజేసి , అంగన్వాడీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, జిల్లా





కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి మంత్రి పరామర్శ..

మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొమ్మ మల్లారెడ్డి సతీమణి బొమ్మ వీరమ్మ గత వారం గుండె పోటుతో మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. మృతురాలు వీరమ్మ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి సోదరి కాగా, ప్రకాష్ రెడ్డిని పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని మృతురాలు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ పరపతి సంఘం కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా బండారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి మురికి కుమారస్వామి





**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని కరీమాబాద్ బీరన్న దేవాలయంలో శ్రీకృష్ణ పరస్పర సహకార పరపతి సంఘం మహాసభ కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని గౌరవ సభ్యులు అందరూ ఏకమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు ఏర కోటేశ్వర్ అధ్యక్షుడు బండారి రాజేశ్వర్ ఉపాధ్యక్షులు కోరే కుమారస్వామి, కోరి నాగరాజు, కార్యదర్శి మురికి కుమారస్వామి, సహయ కార్యదర్శి మండల కొమురెల్లి కోశాధికారి దయ్యాల వీరేశం, సహాయ కోశాధికారి మురికి రవి, ఆర్గనైజర్స్ గొట్టె మల్లేశం, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, గౌడ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కోరే సాంబమూర్తి, చీర రాజు, ఎమ్మె వేణు, కోరే రమేష్, మురికి రాజు, కంకల శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడ్డ సంఘ అధ్యక్షుడు బండారి రాజేశ్వర్ మాట్లాడుతూ గౌరవ సభ్యులు సలహాల మేరకు సంఘం అభివృద్ధికి మా కమిటీ కృషి చేస్తుందని, గౌరవ సభ్యులు మాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన అవకాశం దుర్వినియోగం చేయకుండా సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కుల బాంధవులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె వాయిదా

## విధుల్లో చేరిన ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలవిద్యాశాఖాధికారి కార్యాలయంలో మండల సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు అందరూ మండల విద్యాశాఖాధికారి బైరి సరళ ఆధ్వర్యంలో విధులకు హాజరయ్యారు. గత నెల 10 నుంచి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ డిమాండ్స్ ను ప్రభుత్వం నెరవేర్చాలని, నిరవధిక సమ్మెకు దిగడం జరిగింది. సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి సానుకూలంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇవ్వడం జరిగింది. ఉద్యోగ భద్రత, పే స్కేల్ అమలు గురించి మంత్రి వర్గ ఉప సంఘంలో అతి త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మిగిలిన అంశాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపించి ఆమోద యోగ్యం అయ్యేలా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తానని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి ఎస్ పీడీ ఆదేశాలను గౌరవిస్తూ మంగళవారం నుంచి వారు విధుల్లో హాజరుకావడం జరిగింది. కేజీబీవీ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కూడా విధులకు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు అశోక్, యాదగిరి, రాము, ఇందిరా, నర్సింహ రాములు, సంపత్, స్వామి, బాలు, శిల్ప, స్వప్న పాల్గొన్నారు.

# కోటగుళ్ల గోశాల గోమాతలకు దాన బస్తాల వితరణ



**వరంగల్ వాయిస్ గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు గణపురం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో పనిచేస్తున్న దొడ్డిపాటి లావణ్య చంద్రశేఖర్, దంపతుల కుమారుడు హర్షవర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకొని దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాలకు దానా బస్తాలను అందజేసిన దొడ్డిపాటి లావణ్య చంద్రశేఖర్, దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్ ఖండించారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము లేక పార్టీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు.

# చెత్తను తొలగించారు

## వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కులోని గాంధీ విగ్రహం చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న విషయాన్ని మహాత్మ క్షమించు శీర్షికతో వరంగల్ వాయిస్ లో కథనం రావడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు గాంధీ విగ్రహం చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎన్నో రోజులుగా అపరిశుభ్రంగా ఉన్న గాంధీ విగ్రహం పరిసరాలను వరంగల్ వాయిస్ వెలుగులోకి తెచ్చి సమస్యను పరిష్కరించడంతో స్థానిక ప్రజలు వరంగల్ వాయిస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# స్థానిక సమస్యలను పరిష్కరించాలి

## ➲ సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను, స్థానిక సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఆఫీస్ ముందు మహా ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 8 నుంచి 20 వరకు 12 రోజుల పాటు 36 వార్డులలో 36 దళాలు వేసుకొని ఇంటింటికి సీపీఎం సమస్యల అధ్యయనం చేయడం జరిగింది. ప్రజల స్పందన బాగా ఉందని ఇచ్చిన హామీలు ఏది కూడా పూర్తిగా అమలు కావడం లేదని, స్థానిక సమస్యలు పరిష్కరించడంలో మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నటువంటి సమస్యలు, మహబూబాబాద్ పట్టణంలో చిరు వ్యాపారులు పేదలు రోడ్ల పక్కన నేల మీద పండ్లు కూరగాయలు లాంటి చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని జీవిస్తున్నారు. వీరికి తొర్రూరు బస్టాండ్ స్థలం, ఓసీ క్లబ్ స్థలాన్ని కేటాయించి స్ట్రీట్ వెండర్ జోన్స్ గా అభివృద్ధి పరచాలని కోరారు. పట్టణంలో పేదలు గత అనేక సంవత్సరాల నుంచి ఇల్లు




కట్టుకొని నివసిస్తున్న ప్రతి ఇంటికి పట్టాలు, ఇంటి నెంబర్లు, రోడ్లు, సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్ణపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, వన్ టౌన్ ఏరియా కార్యదర్శి రావుల రాజు, పట్టణ కమిటీ సభ్యులు దేవత్ హేమా నాయక్, చీపిరి యాకయ్య, కుమ్మరి కుంట్ల నాగన్న, చాగంటి భాగ్యమ్మ, బానోతు వెంకన్న, నక్క సైదులు, ఏరియా కమిటీ సభ్యులు యమగాని వెంకన్న, తోట శ్రీనివాస్, ఎస్ కే తజ్జు, బేతమల్ల విజయ, మందుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాంజా అమ్మకదారులపై పోలీసులు దాడి



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైనా మాంజా (పతంగులు ఎగరడానికి ఉపయోగించే దారం) అక్రమ విక్రయాల గురించి విశ్వసనీయ స మా చా రం పై టాస్క్ ఫోర్స్ బృందం మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో చందు అశోక్ కుమార్ దగ్గర మొత్తం రూ .16,350 విలువ గల స్వాధీనం చేసుకున్న సొత్తుతో పాటు నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం మట్వాడ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ జి.బాబులాల్, టాస్క్ ఫోర్స్ టీమ్ మట్టెవాడ పోలీసులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఐనవోలు మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఫంక్షన్ హాల్ లో ఐనవోలు మండల పరిధిలోని వివిధ గ్రామాల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 77 మంది లబ్ధిదారులకు సుమారు 77 లక్షల 8వేల 932 రూపాయల విలువ గల చెక్కులను మంగళవారం టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మానీ శేఖర్ రావు, ఐనవోలు మండల అధ్యక్షుడు సమ్మెట్ట మహేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పోలేపల్లి బుచ్చిరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నకరగంటి మోహన్, మాజీ ఎంపీటీసీ మధు, ఎస్టీ సెల్ సీనియర్ నాయకులు రాయపురం సాంబయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, మండల మహిళా అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, ఐనవోలు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే పండుగలలో సంక్రాంతి పండుగ ఒకటని, దీనిని ప్రతి సంవత్సరం కళాశాలలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అన్నారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలను పరిశీలించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ తెలుగువారి పవిత్రమైన పండుగలలో సంక్రాంతి ముఖ్యమైందని, ముఖ్యంగా గ్రామీణ వాతావరణంతో కూడుకున్న సంక్రాంతి పండుగ ముగ్గులతో ఎంతో సాంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారని, అయితే కళాశాలలోని విద్యార్థులకు ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో సాంప్రదాయక, ఆధునిక సాంకేతిక, మాతృత్వ, యువత, సైతాన్, వంటి ముగ్గులను విద్యార్థులు వేశారని తెలిపారు. పోటీలను పరిశీలించి న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ సుచరిత పాల్, డాక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా బండారి మంజుల



**వరంగల్ వాయిస్, నడికూడ :** బీఆర్టీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండారి మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పరకాల, రాయపర్తి పీహెచ్ సీ ఆశా వర్కర్స్ శాలువాతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి పీహెచ్ సీ అధ్యక్షులు పి.సునీత, లలిత, రమ, శైలజ, నిర్మల, రమాదేవి, సౌందర్య, పీహెచ్సీ పరిధిలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# శ్రీ మార్కండేయ స్వామి దీక్షలు

- సనాతన ధర్మాన్ని పాటిస్తూ మన సంస్కృతిని చాటాలి
- గురుస్వామి చిలుక సర్వప్ప పద్మశాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మన జాతి సమైక్యతకై ప్రేమానురాగాలు వెదజల్లుటకై సనాతన ధర్మ రక్షణకై శ్రీ మార్కండేయ స్వామి దీక్ష వహించి మాలాధారణ చేయాలని గురుస్వామి చిలుక సర్వప్ప పద్మశాలి అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జనవరి నుంచి మార్కండేయ మాలాధారణ దీక్షలు ప్రారంభమయ్యాని తెలిపారు. ఈ దీక్షలు మాఘ శుద్ధ తదియ శ్రీ మార్కండేయ స్వామి జన్మదినం 1-2-2025 వరకు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ దీక్షలు లోక కళ్యాణార్థమై ప్రపంచశాంతి కోరుతూ సమస్త మానవాళి, సర్వప్రాణులు, సుఖశాంతులతో పాడి పంటలతో భారతదేశం సుభిక్షంగా ఉండాలని, సనాతన దర్మరక్షణకై మాలాధారణ దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. పంచ పాండవులు అరణ్యవాస సమయంలో శ్రీ మార్కండేయ మాలాధారణ దీక్షలు చేశారు. మరి ఎంతో మంది దేవి, దేవతలు, ఋషులు అచరించినటువంటి ఈ దీక్షలు గొప్పదైనదని తెలిపారు. దీక్షలు స్త్రీలు, పురుషులు వయస్సు నియమ బేధం లేదు. 41 రోజులు మండలం, 31,21,11 రోజులు వేసుకోవచ్చని, ఇట్టి దీక్ష వలన సంపూర్ణ ఆరోగ్యం, వ్యాపార అభివృద్ధి, ఉన్నత విద్య అభివృద్ధి, ఉద్యోగ ప్రాప్తి, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆర్థమాతని, అష్టమ శని, ఆపద, మృత్యు దోషం, గ్రహ బాధలు, రాహుకేతుల దోషం, కలహములు తోలగిపోవునని చెప్పారు. స్త్రీలు సంపూర్ణ సౌభాగ్యవతిగా, దీర్ఘసుమంగళిగా జీవిస్తారన్నారు. సంతాన ప్రాప్తి కలుగును. కన్నెలకు వివాహప్రాప్తి, యువకులకు ఉద్యోగప్రాప్తి, వివాహప్రాప్తి, పిల్లలకు సంపూర్ణమైన ఉన్నత విద్య కలుగునని తెలిపారు. ఇట్టి దీక్షలు కరీంనగర్ జిల్లా మాండవ్య నది తీరమున శివభక్త మార్కండేయ దేవాలయంలో స్వీకరించవచ్చును.



లేని యెడల దూర ప్రాంతాల వారు మీ గ్రామాలలో జిల్లాలో ఏ చోట మార్కండేయ దేవాలయం వుండునో అచ్చట మార్కండేయ మాలాధారణ చేయవచ్చని చెప్పారు. లేకుంటే భావనఋషి భద్రావతి దేవాలయంలో కాని, శివలింగం ఏ చోట ఉంటే అక్కడ మాలాధారణ దీక్ష ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. దీక్ష సమయంలో స్త్రీలు, పురుషులు పసుపు వస్త్రములు ధరించాలన్నారు. తల్లిదండ్రులు చేతగాని, పద్మబ్రాహ్మణ పౌరోహితులు, అర్చకులు, గురుస్వాముల చేతగాని మాలాధారణ దీక్షలు వేసుకోవాలన్నారు. మాలాధారణ మూల మంత్రం శ్రీ మార్కండేయ నమః అని జంపించాలని తెలిపారు. శ్రీ మార్కండేయ స్వామి మాలాధారణ చేయుట వలన పద్మశాలి ఇంటి అడపడుచు శ్రీ మహాలక్ష్మి దీవెనలు, శ్రీ లక్ష్మి కటాక్షం ఎల్లవేళలా ఉంటుందన్నారు. శ్రీ మార్కండేయ స్వామి ఆశీస్సులు సకల శుభములు చేకూరుస్తాయని చెప్పారు. ఇది అన్ని రాష్ట్రాలలో చేస్తున్న దీక్షలు ప్రతి జిల్లా పద్మశాలి సంఘం సభ్యులు, ప్రతి పద్మశాలి సంఘ అధ్యక్షలు, కార్యవర్గ సభ్యులు, యువజన సంఘ సభ్యులు, ప్రతి పద్మశాలి సంఘ నాయకులు దీక్షల గురించి తెలిపి, ఆచరించాలని కోరారు. మరిన్ని వివరాలకు అఖిల భారత శ్రీ మార్కండేయ స్వామి మాలాధారణ దీక్షల, ఏకాదశ రాత్రుల గురుస్వామి, మార్గదర్శకులు " పద్మకుల రత్న" చిలుక నర్సప్ప పద్మశాలి, సెల్: 90596 71181 ను సంప్రదించవచ్చు.

# హెచ్ఎంపీవీ వైరస్ ప్రమాదకరం కాదు

- ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ, మాస్కులు ధరించాలి
- డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ఆదేశానుసారం యూ.ఎఫ్.డబ్ల్యూ. సీ.(పీ.పీ యూనిట్) ఎంజీఎం హాస్పిటల్ ఆశ డే కార్యక్రమానికి డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి హాజరయ్యారు. ఆశల పని తీరుపైన సమీక్షించి, ప్రజలకు అందించవలసిన సేవల గురించి, సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడం, అస్తమా, శ్వాస కోశ వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ ,చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్, దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని,



మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలన్నారు. కొత్తగా వచ్చిన హెచ్ఎంపీవీ వైరస్ అంతా ప్రమాదకరం కాదని, సాధారణ జలుబు, జ్వరం లాగా వచ్చే లక్షణాలు కలిగి ఉంటుందన్నారు. కాబట్టి ప్రజలు మాస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎఫ్ డబ్ల్యూసీ (పీపీ యూనిట్) ఎంజీఎం హాస్పిటల్ ఇంచార్జి వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్విని, ఎన్సీడీ సూపర్ వైజర్ రేవూరి ప్రకాష్ రెడ్డి, పీ.పీ.యూనిట్ హాస్పిటల్ సూపర్ వైజర్ నర్మద, రామ రాజేష్ ఖన్నా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్), వడ్డేపల్లి, హనుమకొండలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3 ఆధ్వర్యంలో ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో, వరంగల్ వారిచే గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుహాసిని మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు మనిషిని సర్వనాశనం చేస్తాయని, డ్రగ్స్ రహిత సమాజమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.రవీందర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వాడకం, ధూమపానం, మద్యపానం ఒక ప్రమాదమైన వ్యసనాలని అన్నారు. యువతరాన్ని దారి మళ్లించి, చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలలో వివిధ రకాలున్నాయి , నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డీ. మొదలైనవి ముఖ్యమైనవని, యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. ముఖ్య అతిథి , డీఎస్పీ సైదులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల శారీరక, మానసిక ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు వస్తాయని, గంజాయిలో ఉండే టెట్రా హైడ్రోకెనబినాయిడ్ (టీహెచ్సీ) అనే రసాయనం వ్యక్తులను దానికి బానిసలుగా మారుస్తుంది. అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపి ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుంది. చురుకు దనం సన్నగిల్లుతుంది. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు




చేయడానికైనా వెనుకాడరని తెలిపారు. మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసిందన్నారు. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగి ఉన్న వారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులని వివరించారు. తదనంతరం మాదకద్రవ్యాలపై ఒక డాక్యుమెంటరీని ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.కవిత, రామా రత్నమాల, డా.వి.మమత, అధ్యాపకులు కే.రాజేశ్వరి, డా.రేణుక, డా.ఆర్.లక్ష్మీకాంతం, డాక్టర్ బి.సునీత, డా.ఎం.ప్రశాంతి, ఎన్.ఉదయశ్రీ, పద్మ, జ్యోతిర్మయి, జ్యోతి, డా.శ్రీలత, టి.అరుణ, మధు, సారంగపాణి, డా.టి.మహేష్, సామ్యూల్ ప్రవీణ్, యుగంధర్, లఖాన్ సింగ్, రాజ్ కుమార్, కృష్ణ, సౌజన్య, శ్రీదేవి, భోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గణపురం పీహెచ్ సీకి దూరమవుతున్న రోగులు

➲ కనీస మందులు, వైద్య పరికరాల కొరత
➲ రోగులకు వైద్యం అందని దైన్య స్థితి



**వరంగల్ వాయిస్, గణపురం :** మందులు, కనీస వైద్య పరికరాల కొరత, అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు సరియైన వైద్య అధికారులు లేకపోవడంతో వైద్యం అందని పరిస్థితిలో గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పేద రోగులు దూరమవుతున్నారు. సిబ్బందికి నెలనెలా లక్షల రూపాయల జీతాలు చెల్లిస్తున్న ఎంతో ఖరీదైన ఆసుపత్రి భవనం ఉన్న పేద రోగులు వైద్య సాయం పొందలేకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ సర్కారులో పీహెచ్ సీ ఎంత అద్వానంగా ఉందో రేవంత్ సర్కార్ సమయంలో కూడా అలాగే ఉంది. ఏమాత్రం దాని స్థితిగతులు మారలేదు. సాధారణ దగ్గు, జలుబు, జ్వరం, ఆయాసం తదితర రోగాలకు ఒక మందు ఉంటే ఇంకో మందు లేదంటున్నారు. గుండె పరీక్షలకు కనీస ఈసీజీ లేదు. ఉదయం ఉదయం రెండుసార్లు చేయించుకునే షుగర్ రక్త పరీక్షలకు అవకాశం లేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లోకి వెళ్లి డబ్బులు కుమ్మరించి ఆ పరీక్ష చేయించుకోవాల్సి వస్తుందని సామాన్య రోగులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా ఉండగా ఇద్దరు వైద్యాధికారులు మహిళలే ఉన్నారు. ఒక పురుష వైద్యాధికారి అవసరాన్ని వైద్యశాఖ మర్చిపోయింది. ఇలా ఉండగా నిత్యం రక్త పరీక్షలకు బ్లడ్ శాంపుల్ తీసి భూపాలపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి పంపుతున్న రిపోర్టులు ఇవ్వలేకపోతున్నారు. సిస్టం ప్రింటర్ రెండు నెలల క్రితం పాడవడంతో పక్కకు పడేశారు. దీంతో రిపోర్టుల ప్రింట్ కాపీలు ఇవ్వడం లేదు. సెల్ ఫోన్లలో చూసుకోవాల్సి వస్తుంది. అయితే పేద రోగులకు చాలామందికి సెల్ ఫోన్లు లేకపోవడం వల్ల రక్త పరీక్షల రిపోర్టులను పొందలేకపోతుండడంతో బయట ప్రైవేట్ కేంద్రాల్లో డబ్బులు ఇచ్చి రక్త పరీక్షలు చేయించుకునే పరిస్థితి తప్పడం లేదు. కాగా, రిపోర్టులు ఇచ్చే ప్రింటర్ టోనర్ అయిపోవడం వల్ల రిపోర్టులు ఇవ్వలేకపోతున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో ప్రింటర్ లో టోనర్ వేయించడానికి రెండు నెలలుగా వైద్యాధికారుల దగ్గర డబ్బులు లేవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కనీస మందులు, ఈసీజీ, ఎక్స్ రే, తదితర సౌకర్యాలు ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి పేద రోగులకు కనీస వైద్య సాయం అందించాలని అప్పుడే ప్రజలు హర్షిస్తారని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తా

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** తెలంగాణ పోరాట యోధులు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషిచేసిన మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తామని భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. భూపాలపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం-2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను జిల్లా అధ్యక్షులు ఎలగొండ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావుకు పూల బోకే అందజేసి శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం వదులుకున్న గొప్ప పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు ఇప్పటికే ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అడ్డగట్ల శ్రీధర్, రాష్ట్ర రాజకీయ విభాగం నాయకులు గూట్ల తిరుపతి, ఇప్పకాయల నరసయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలిపాక ప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు బొద్దుల శంకర్, విక్రమ్ సేన, రాష్ట్ర రైతు విభాగం నాయకులు తుమ్మ రమేష్, రాష్ట్ర మీడియా సెల్ విభాగం నాయకులు సామల శ్రీనివాస్, శేఖర్ నాని, సుభాస్ కాలనీ ఆదర్శ పద్మశాలి సంఘం అధ్యక్షులు కొండ శీను, కార్యదర్శి దుబాసి రాజం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి క్యాతం అనిల్ కుమార్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి వంగ కుమారస్వామి, నాయకులు క్యాతం మహేందర్, దుబాసి సమ్మయ్య, రాచర్ల శ్రవణ్, తాళ్ల శంకర్ పాల్గొన్నారు.

# కాలం చెల్లిన రబ్బరు ట్యూబులు మార్చుకోవాలి

■ తెలంగాణ వంటగ్యాస్ డీలర్ల అధికార ప్రతినిధి పీవీ మదన్ మోహన్




**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** వంటగ్యాస్ వాడకం దారులు కాలం చెల్లిన సురక్ష రబ్బరు ట్యూబులు వెంటనే మార్చుకోవాలని తెలంగాణ వంటగ్యాస్ డీలర్ల అధికార ప్రతినిధి, హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీస్ అధినేత పీవీ.మదన్ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీలో షోరూం స్టాఫ్ డెలివరీ సిబ్బందికి పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ తరగతుల్లో ఏజెన్సీ ద్వారా కస్టమర్లకు అందిస్తున్న గ్యాస్ సిలిండర్లు, కస్టమర్ల భద్రత కొరకు చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు.భారత ప్రభుత్వ పెట్రోలియం మంత్రిత్వ శాఖ గత ఏప్రిల్ నుంచి అన్ని ఆయిల్ సంస్థలు (ఐఓసీఎల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్) ఎల్పీజీ వాడకందారులకు ప్రాథమిక భద్రతా చర్యలు (బీఎస్సీ )బేసిక్ సేఫ్టీ చెక్స్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా డెలివరీ బాయ్ కస్టమర్ ఇంటిని సందర్శించి ఎనిమిది అంశాలతో కూడిన ప్రశ్నావళితో వంటగ్యాస్ స్థితిగతలపై పరిశీలన జరిపే కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన డెలివరీ సిబ్బందికి ఆయిల్ కంపనీలు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నాయని వివరించారు. ఈ వెసులుబాటు డిసెంబరు నెలతో ముగిసిందని తెలిపారు. ఇందులో ముఖ్యంగా "సురక్ష రబ్బరు ట్యూబ్" కాలపరిమితి ఐదు సంవత్సరాలు, పరిమితి దాటిన రబ్బరు ట్యూబులు విధిగా మార్చడం, ఏదేని లీకేజ్ సమయంలో టోల్ ఫ్రీ నంబరు 1906 సమాచారం అందించడం, ఒకే కంపెనీకి చెందిన సిలిండర్లు రెగ్యులేటర్ వాడడం, ఈ కేవైసీ, ఇతర ప్రాథమిక భద్రతా చర్యలపై అవగాహన కల్పించేందుకు కృషి చేశామని తెలిపారు. అయితే చాలా మంది కాలపరిమితి దాటిన సురక్ష రబ్బరు ట్యూబులు వాడుతున్న కస్టమర్లు ఉన్నారని, వారు వెంటనే కొత్త సురక్ష రబ్బరు ట్యూబ్ పొంది ప్రమాద బీమాకు అర్హత పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ కస్టమర్లు మొండయ్య, ఒల్లాల రమేశ్, కరాటే రమేశ్, స్టాఫ్ పవన్, శరత్, భరత్, సరిత, భరత్ రెడ్డి, సీనియర్ డెలివరీ సిబ్బంది కనకయ్య, చిరంజీవి, ప్రభు, దామోదర్, కుమార్, భాస్కర్, ప్రశాంత్, నర్సయ్య, రాజు, నరేశ్ ప్రభుతులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి ఉపకరణాలు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చార్ బౌళికి చెందిన ఆరవ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థి జాఫర్ అలీ బాల్యంలో పోలియో వ్యాధికి గురవడంతో నడకను కొనసాగించడం ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్ వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ కు చెందిన దాతలు కవి, రచయిత, తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షులు, గురజాడ శోభా పేరిందేవి సహకారంతో రూ.18000/-లు విలువ చేసే ఉపకరణాలను తయారు చేయించి సంస్థ కార్యాలయంలో విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, అనాథల కోసం గురజాడ శోభ చేస్తున్న కృషి చాలా విలువైందని పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థికి చేయూతనందించినందుకు ఫౌండేషన్ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శైలజ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ వ్యాపారవేత్త కొల్లూరు పెద్దన్న పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీ వాసుదేవులు నవంబర్, డిసెంబర్ 2024 నెలలో ప్రతీ రోజు పాఠశాలకు క్రమం తప్పకుండా (100)శాతం హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాతలకు, ఈ కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన అకాడమిక్ కోఆర్డినేటర్ వాసుదేవులుకు ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు ప్రోత్సహించాలని, అదేవిధంగా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించుటకు గర్భిణిలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత నెలలో జరిగిన అబార్షన్లపై సమీక్షించి క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు మొదటి కాన్పులో ఆడపిల్లలు ఉండి రెండోసారి గర్భం దాల్చిన వారిపై గట్టి నిఘా ఉంచాలని, సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ కేసులను 100శాతం పూర్తి చేయాలని, వ్యాధి నిరోధక టీకాలను 100శాతం చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయం

## ➲ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు పెద్దఎత్తున జేజేలు కొడుతున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన పట్ల ప్రజలు సంతోషంతో సంబరాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం, రేషన్ కార్డుల విషయంలో ప్రకటించిన నిర్ణయాలకు రైతులు తొర్రూరు పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝూన్సీ రెడ్డి మాట్లాడుతూ సీఎం నిర్ణయాలు రాష్ట్రంలో సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం సాధనకు దోహదం చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఈ పథకాల అమలు వేగవంతం చేసేందుకు తానంతట తానే పర్యవేక్షణ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది రైతులకు రూ.12,000 అందించనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం, వ్యవసాయంపై ఆధారపడి ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా ఉంటుందన్నారు. రేషన్ కార్డు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకు కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఈ ప్రకటన ద్వారా లక్షల మంది కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. రైతులు, నిరుపేద కుటుంబాలు ఈ పథకాల అమలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి, వెంకటాచారి, నాయకులు హరీష్, బాలకృష్ణ, వెంకన్న, పట్టణ ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల నాయకులు, మహిళ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంచాలంటూ సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని సివిల్ సప్లై గోదాముల ఎదుట ఆందోళన నిర్వహించారు. వేతనాల పెంపు జీఓలను విడుదల చేయాలని కార్మికుల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ, హమాలీ కార్మికుల కోసం గత ప్రభుత్వం పెంచిన ధరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారే తప్ప అమలు చేయడం లేదని ఆరోపించారు. వేతనాలు, బోనస్, బీమా, యూనిఫామ్ తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు నవీన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు.

## గుట్కా నిల్వలపై టాస్క్ ఫోర్స్ దాడి



**వరంగల్ వాయిస్, క్రైం :** ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా గుట్కా విక్రయాలు జరుపుతున్నారనే విశ్వసనీయ సమాచారంపై మంగళవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు వరంగల్ లోని ఇంతేజార్‌గంజ్, మట్టె వాడ, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ల పరిధిలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రూ.16,200, మట్టె వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రూ. 86,200 మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రూ. 32,150 విలువ గల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాడి పూర్తయిన తర్వాత నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్లు జి.బాబులాల్, ఎం.రంజిత్, ఎస్సై వి.దిలీప్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీస్ స్టేషన్ల పోలీసులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ కు కౌకొండ విద్యార్థి సాయి తేజ



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరమ్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఈ నెల 4న జరిగిన సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ లో కౌకొండ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పూరేళ్ల సాయితేజ తెలుగు మీడియం విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఈ నెల 21న హైదరాబాద్ లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హనుమకొండ జిల్లా నుంచి ఎంపికయ్యారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్, సోషల్ స్టడీస్ గైడ్ టీచర్ సాంబరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లితండ్రులు, కౌకొండ గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ గోల్కొండ అరుణ, విద్యార్థి తల్లిదండ్రులు పూరెళ్ల రాజయ్య, మంజుల, సాయికిరణ్, గ్రామ నాయకులు మేకల చిరంజీవి, మేకల రఘుపతి, ప్రశాంత్, అనిల్, అంగన్వాడీ టీచర్లు కమ్రూన్, తదితరులు పాల్గొనీ విద్యార్థిని అభినందించారు.

## ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఎం.బీ.ఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ ను మంగళవారం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి అసిం ఇక్బాల్ విడుదల చేశారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జనవరి 22 వరకు, అపరాధ రుసుము రూ. 250/–తో జనవరి 24 వరకు ఉనట్టు వారు తెలిపారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో చూడవచ్చని అందులో పేర్కొన్నారు.

## రమేష్ బిదురిపై చర్యలు తీసుకోవాలి

### బీజేపీ ఏమ్మెల్యే అభ్యర్థిని వెంటనే సస్పెండ్ చేయాలి

### జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీపై ఢిల్లీ రాష్ట్ర, కల్కాజీ నియోజకవర్గ బీజేపీ ఏమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదూరి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఖండించారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ మహిళలంటే కనీస గౌరవ, మర్యాద లేని వ్యక్తికి బీజేపీ టికెట్ ఇచ్చి వారి ఓట్లు వేయమని అడగటం సిగ్గుచేటన్నారు. రమేష్ బిదురి వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, బీజేపీ రమేష్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పక్కన పెట్టి మత విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరికాదన్నారు. బీజేపీ దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని, మహిళలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెయ్యి గొంతులు.. లక్ష డబ్బులు బస్సు యాత్ర ప్రారంభం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ సూచన మేరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూపాక శివ ఆధ్వర్యంలో మాదిగ కవులు, కళాకారులు,మేధావులు చేపట్టిన "వెయ్యి గొంతులు లక్ష డప్పులు"బస్సు యాత్రను మంగళవారం భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ లో ప్రారంభించనున్న నేపథ్యంలో సిద్ధంగా ఉన్న ప్రచార రథాన్ని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బొడ్డు దయాకర్, ప్రజా గాయకులు గోల్కొండ బుచ్చన్న లు హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ ఏరియాలో మంగళవారం పరిశీలించి, సందర్శించి సిద్ధం చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో చేపట్టబోయే వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కళాకారులు బరిగెల బాబు, భరత్, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ విభాగంలో అనూషకు డాక్టరేట్..



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ పరిశోధకురాలు ఎస్.అనూషకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ ఎస్. అనూష "appraisal of some medicinal plants for the management of diabetic complications through inhibition of aldose reductase and advanced glycation end products formation" అనే అంశంపై విభాగ ఆచార్యులు ఆచార్య వి. స్వరూప రాణి పర్యవేక్షణలో పూర్తి చేశారు. కొత్తపల్లి గ్రామం, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ జిల్లాకు చెందిన డాక్టర్ ఎస్.అనూషను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## కామర్స్ విభాగంలో స్రవంతికి...



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగ పరిశోధకురాలు స్రవంతి గొడిశాలకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ స్రవంతి గొడిశాల "పెర్ఫార్మన్స్ ఎనాలసిస్ అఫ్ టెలికాం ఇండస్ట్రీ–ఎ స్టడీ అఫ్ సెలెక్ట్ ఎంటర్ ప్రైజెస్ (performance analysis of telecom industry–a study of select enterprises)" అనే అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి.కృష్ణమాచారి పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టర్ స్రవంతి గొడిశాల ప్రస్తుతం హైదరాబాద్ లోని అవినాష్ ఇన్ స్టిట్యూట్ అఫ్ కామర్స్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ స్రవంతి గొడిశాలను అభినందించారు.

## చరిత్ర విభాగంలో రమేష్ బాబుకు..



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగ పరిశోధకుడు గుగులోత్ రమేష్ బాబుకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ గుగులోత్ రమేష్ బాబు "ది రోల్ అఫ్ విమెన్ ఇన్ ది తెలంగాణా పీజెంట్స్ అర్మ్డ్ స్త్రగుల్ (1945–51) {the role of women in the Telangana peasants armed struggle (1945–51)} అనే అంశంపై విభాగ విశ్రాంత సహా ఆచార్యులు డాక్టర్ పి. సదానందం పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఎల్గూర్ స్టేషన్ గ్రామం, సంగెం మండలం, వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ గుగులోత్ రమేష్ బాబును పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభనందించారు.

# ఈఫిల్ టవర్ ముందు అడివిశేష్

టాలీవుడ్ యాక్టర్ అడివిశేష్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోతుంది టైటిల్ రోల్ పోషించిన గూడఛారి. ఈ ఫ్రాంఛైజీలో జీ2 కూడా వస్తుందని తెలిసిందే. మేజర్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ ఇప్పటికే సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. తాజాగా ఈ చిత్ర టీంలోకి బేబిజాన్ నటి వామికా గబ్బి వచ్చేసింది. మిషన్‌లో భాగంగా సూట్‌లో ఉన్న అడివిశేష్, వామికా ఈఫిల్ టవర్ ముందు కనిపిస్తుండటం తాజా లుక్‌లో చూడొచ్చు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన జీ2 ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతోంది. అడివి శేష్‌ను సీక్వెల్‌లో స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో చూపిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.





# ఆ నోటీసులు అవాస్తవం

ప్రకటన విడుదల చేసిన చంద్రముఖి నిర్మాణ సంస్థ లేడీ సూపర్ స్టార్ నయనతారకు చెందిన డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చంద్రముఖి నిర్మాతలు నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారంటూ నిన్నటి నుంచి తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను వాడుకున్నందుకు నయన్ సహా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు రూ.5 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలపై 'చంద్రముఖి' సినీ నిర్మాణ సంస్థ శివాజీ ప్రొడక్షన్స్ తాజాగా స్పందించింది. నయన్‌కు తాము ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని సదరు నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను తమ పర్మిషన్ తీసుకొనే వినియోగించుకున్నారని స్పష్టం చేసింది. మొత్తం 17 సెకన్ల సన్నివేశాలను రౌడీ పిక్చర్స్ సంస్థ వాడుకోవచ్చని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేసింది. ఈ ఎన్‌వోసీని మనోబాల విజయబాలన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# ఆస్కార్ 2025 బరిలో..

## ఉత్తమ చిత్రాల కేటగిరిలో ఐదు సినిమాలివే...

ఆస్కార్ 2025 97వ అకాడమీ అవార్డ్స్ ఈవెంట్ (ఆస్కార్ 2025)కు కేవలం రెండు నెలల సమయం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఈ ఏడాది ఆస్కార్‌లకు అర్హత సాధించిన 323 చలన చిత్రాల జాబితాను ప్రకటించింది. వీటిలో 207 సినిమాలు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ చిత్రం కేటగిరీలో అర్హత సాధించాయి. ఈ జాబితాలో ఐదు భారతీయ సినిమాలు అర్హత సాధించడం విశేషం. భారతీయ సినిమాల జాబితా: కంగువ (తమిళం), ఆడుజీవితం (ది గోట్ లైఫ్)–హిందీ, సంతోష్ (హిందీ), స్వతంత్ర్య వీర్ సావర్కర్ (హిందీ), (మలయాళం–హిందీ), Gఅతీశ్రీం షఅశ్రీశ్రీ పవ Gఅతీశ్రీం (హిందీ–ఇంగ్లీష్) ఈ నామినేషన్లకు ఓటింగ్ రేపటి నుంచి షురూ కానుంది. ఈ ప్రక్రియ జనవరి 12 వరకు ముగియనుంది. అకాడమీ ఫైనల్ నామినేషన్స్‌ను జనవరి 17న ప్రకటించనుంది. 97వ ఆస్కార్ అవార్డ్ ఈవెంట్–2025 మార్చి 2నలోని డాల్బీ థియేటర్‌లో జరుగనుంది. మరి ఈ జాబితా నుంచి ఏ సినిమా అయినా ఫైనల్ నామినేషన్‌లో చోటు సంపాదించుకుంటుందా..? అని భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






# 'స్క్విడ్ గేమ్'లో స్టార్ హీరోల వీడియో వైరల్

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్'. ఈ కొరియన్ వెబ్‌సిరీస్ ఇప్పటికే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హ్వాంగ్ డాగ్ హ్యూక్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్‌లో డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను ఆసక్తికరంగా చూపించారు. ఆటలు ఆడేందుకు వచ్చిన 456 మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. అక్కడ వారంతా ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు అనే కథాంశం ఆధారంగా వచ్చిన ఈ సిరీస్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే, ఈ 'స్క్విడ్ గేమ్'లో ఇండియన్ సినీ స్టార్స్ పాల్గొంటే ఎలా ఉంటుంది..? ఈ ఆలోచనతోనే ఓ నెటిజన్ ఏఐ సాయంతో వీడియోను రూపొందించారు. స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్, దళపతి విజయ్, రజినీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, నాగచైతన్య, సూర్య, మహేశ్‌బాబు, ధనుష్, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్, ప్రభాస్, పవన్ కల్యాణ్, అజిత్, యష్, రామ్ చరణ్, దుల్కర్ సల్మాన్, రానా, హృతిక్ రోషణ్ తదితరులు 'స్క్విడ్ గేమ్' సిరీస్‌లోని ఆటగాళ్ల దుస్తుల్లో కనిపించారు. 'స్క్విడ్ గేమ్ ఇండియా' పేరుతో విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# మరో సాంగ్ రిలీజ్..

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. ''అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా''. అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది.









# భక్తులకు సకల సౌకర్యాలు

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశం
- పాల్గొన్న కుడా ఛైర్మన్, మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** సంక్రాంతి పర్వదినం సందర్భంగి మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే ఐనవోలు జాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రకటించారు. జాతరకు సంబందించి ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి , టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు , జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే, దేవాదాయ శాఖ అధికారులు తదితతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా తాగు నీటి వసతి, మరుగు దొడ్లు, పారిశ్యుద్యం, క్యూ లైన్ల క్రమబద్ధీకరణ ముఖ్యమన్నారు. మహిళా భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకొనే రూంలు, ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. పోలీస్, విద్యుత్, హెల్త్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఆర్అండ్ బి, పీఆర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఫైర్, ఐబీ తదితర శాఖల అధికారులు దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాతర విజయవంతానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అలాగే సంక్రాంతి పండుగ రోజున జరిగే జరిగే పెద్ద రథం నిర్వహణలో ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా చూడాలన్నారు. శివరాత్రి రోజు పెద్ద పట్నం వేసినప్పుడు తొక్కిసలాటలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతరలో విక్రయించే పూజా సామగ్రి, కొబ్బరి కాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**శాశ్వత ఏర్పాట్లు.. : కుడా ఛైర్మన్**

జాతర ఏర్పాట్లపై కుడా ఛైర్మన్ మాట్లాడుతూ.. ఐనవోలు మల్లికార్జునస్వామి టెంపుల్ సిటీ ఆలయంగా శాశ్వత అభివృద్ధి పనుల కోసం ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. చిన్నా చితకా పనులు కాకుండా భావితరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. కుడా తరపున కావాల్సిన నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరావు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమాన్ ప్రారంభం..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో సుమారు రూ.17 లక్షల వ్యయంతో పున్నేల్ క్రాస్ వద్ద దాతల సహాయ సహకారాలతో నిర్మించిన శ్రీ ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి నూతన కమాన్ ను మంగళవారం టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఐనవోలు జాతర ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ఆలయ ఈవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని వివిధ గ్రామాలకు చెందిన 70మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.71,33,265 విలువ కలిగిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మునిసిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.సంతోష్, ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ లపై సమీక్ష

**పాల్గొన్న ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కార్యాలయంలో మంగళవారం ఆయిల్ ఫెడ్ జిల్లా కో–ఆర్డినేటర్ లతో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఎండి యాస్మిన్ భాషా సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో సిద్దిపేట, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాద్రి, భువనగిరి యాదాద్రి, జనగామ, నారాయణ పేట, మహబూబాబాద్ జిల్లాల ఆయిల్ ఫెడ్ ఇంచార్జులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమీక్షా సమావేశంలో జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఓపీడీ మేనేజర్ స్వప్న, మేనేజర్ ప్రవీణ్, హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జంగాను కలిసిన సారయ్య

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మంగళవారం పరిశ్రమల భవన్ లోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి సారయ్యను శాలువాతో సత్కరించి పూల మొక్కను బహుకరించారు.

# ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం

- అప్పుడే ప్రజల ఇబ్బందులు తొలిగిపోతాయి
- పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే పట్టణాలు అభివృద్ధి చెందడమే కాదు.. గ్రామాలలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందిందని భావించాలని పంచాయతి రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లాలోని తాడ్వాయి మండలం కొడిశాల నుంచి పోచాపూర్(వి) వరకు రూ.4.10 కోట్ల నిధులతో బీటీ రోడ్డు, లింగాల నుంచి బొల్లేపల్లి (వి) వరకు రూ.4.10 కోట్లతో బీటి రోడ్డు, పోచాపూర్ నుంచి బందాల (వి) వరకు రూ.3.80 కోట్లతో బీటి రోడ్డు, పోచాపూర్ లోని మిని గురుకులంలో రూ.40 లక్షల నిధులతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులకు రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క ఊటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన రోడ్డు నిర్మాణ పనులను రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పోచపూర్ గ్రామంలో అధికారులతో కలసి నిర్వహించిన ప్రజాదర్బార్ లో పాల్గొని స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 13న మారుమూల గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్ళని పరిస్థితి ఉండేదని, ఎలాగైనా బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఆయా గ్రామాల రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశంతో కంటైనర్ హాస్పిటల్, పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందని వీటిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లోని మంత్రులు ఆయా రాష్ట్రాల ఏజెన్సీ ప్రాంతాల్లో కంటైనర్ హాస్పిటల్, పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రమ్, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశం, డీపీఓ దేవ్ రాజ్, ఆర్డీసీ డీఎం జోస్న, ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్, ఎంపిడీఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**మొదటిసారి ములుగు జిల్లాలో మెగా జాబ్ మేళా..**

**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని, అనేక కష్టాలు పడుతూనే పైకి ఎదగాలని రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పీఎస్ఆర్ గార్డెన్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఈజీఎంఎం సంస్థల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని సీజీఎంఎం స్పెషల్ కమిషనర్ సీఈవో బి.షఫీ ఉల్లా, కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఎల్ డీఎం జయప్రకాష్, పలు కంపెనీలకు చెందిన సీఈఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com